క్లుప్తంగా

బీసీలపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మారేష్

పటమట(విజయవాడతూర్పు): బీసీలు గురించి మాట్లాడే నైతిక అర్హత టీడీపీకి లేదని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో బీసీల మీద దాడులు పెరిగాయని టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. విజయవాడలోని ఆర్టీసీ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీసీలకు వెన్నుదన్నుగా, వెన్నెముకగా నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచిందన్నారు. దీంతో రాజకీయ ఉనికి కోల్పోతున్న ప్రతిపక్షాలు బీసీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి దూరం చేయాలనే దురాశతో మాట్లాడున్నాయని దుయ్యబట్టారు. రాజ్యసభ సీట్లను రూ.వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర చంద్రబాబునాయుడుదని గుర్తుచేశారు. అదే రాజ్యసభ సీట్లను బీసీలకు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దని వివరించారు. 92 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో బీసీ కులగణనకు అంకురార్పణ చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు.

భగవాన్ సత్యసాయి సర్కిల్‌గా సీతారామపురం జంక్షన్

వీఎంసీ గెజిట్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో సెంట్రల్ నియోజకవర్గంలోని సీతారాంపురం జంక్షన్‌ను భగవాన్ శ్రీ సత్యసాయి జంక్షన్‌గా నామకరణం చేస్తూ వీఎంసీ శుక్రవారం గెజిట్ విడుదల చేసింది. అక్టోబర్ 31వ తేదీన జరిగిన వీఎంసీ కౌన్సిల్లో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అజెండాలో ప్రతిపాదన చేయగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలపగా శుక్రవారం దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి.

కవిత్వం జనరంజకం కావాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కవిత్వం జనరంజకమైతేనే సమాజాన్ని మరింత ప్రభావితం చేయగలదని సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జనరంజక కవిత్వం అంశంపై సదస్సును సొసైటీ లైబ్రరీ హాల్‌లో నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ కవిత్వం ఆలోచింపజేసేదిగా, ప్రజలను చైతన్యవంతం చేసేదిగా ఉండాలన్నారు. కవి చలపాక ప్రకాష్ మాట్లాడుతూ సాహిత్యానికి పాఠకుల సంఖ్యను పెంచడానికి రచయితలు కృషి చేయాలన్నారు. నిస్సారమైన సాహిత్యంతో ప్రజలు దూరమవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు వెన్న వల్లభరావు గుమ్మా సాంబశివరావు, సంస్థ గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో మండల పూజ మహోత్సవం పురస్కరించుకుని శుక్రవారం అయ్యప్ప, భవానీ దీక్షాధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు గెల్లి మోహన్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వరకు అన్నదానం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, అన్నదాన కమిటీ కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత సంబరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని రామాలయంలో గ్రామ దేవత గౌరీ దేవి (గంగానమ్మ) సంబరం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నాగులచవితి పర్వదినం పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఆమె మాట్లాడుతూ ఆనవాయితీగా జరుపుకుంటున్న గంగానమ్మ సంబరాలను కొనసాగించడం భక్తుల్లో ఉన్న ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనమన్నారు. గంగానమ్మ తల్లి చల్లని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్రి మల్లికార్జునరావు, పేడాడ రామచంద్రరావు, పోలిపల్లి చిన్న, దాసరి శేఖర్, బడుగు చిన్న, విజయ్, రేవులగడ్డ, బొమ్ము మధు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ 4.84 లక్షలు

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయం రూ.4,84,953 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను శుక్రవారం దేవదాయశాఖాధికారి వి.అనురాధ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ భక్తులు హుండీల ద్వారా 56 రోజులకు గానూ సమర్పించిన కానుకలు లెక్కించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు మత్తె కిరణ్ కుమార్, సిబ్బంది, సేవా దళ్ సభ్యులు పాల్గొన్నారు.







జోష్ నింపిన సీఎం పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నూజివీడు పర్యటన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానుల్లో జోష్‌ను నింపింది. పేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీఎం సభకు వేలాది మంది ప్రజలు తరలిరావడంతో సభాస్థలిలోనే కాకుండా మెయిన్‌రోడ్డు మొత్తం జనంతో కిక్కిరిసింది. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో యువకులు, మహిళలు 'జై జగన్' అంటూ కేరింతలు కొట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





రేపు మాదిగల ఆత్మీయ వనసమారాధన

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మాదిగల ఆత్మీయ వనసమారాధన కార్యక్రమం ఆదివారం జరుగుతుందని నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆత్మీయ వనసమారాధన కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను మాదిగ సంఘం నాయకులతో కలసి కొండపల్లి మున్సిపాల్టీ సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు శుక్రవారం ఆవిష్కరించారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలోని రాజు మామిడి తోటలో జరిగే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీకి చెందిన మాదగ సోదరులు పాల్గొనాలని కోరారు.



మాదిగల ఆత్మీయ వనసమారాధన పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

అదనపు గదులు డిసెంబర్‌లోపు పూర్తి చేయాలి

కేజీబీవీ సెక్రటరీ మధుసూదన రావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మన బడి, నాడు–నేడు పథకంలో మంజూరైన అదనపు తరగతి గదులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కేజీబీవీ కార్యదర్శి డి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏ.కొండూరు, రెడ్డిగూడెం కేజీబీవీలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత ఏ. కొండూరు కేజీబీవీని సందర్శించి విద్యార్థుల నోటు పుస్తకాలను, వర్క్ బుక్స్ పరిశీలించారు. సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమాసిక పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాసిరకం అరటి పండ్లు, కోడిగుడ్లు ఇవ్వొద్దని హెచ్చరించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక అమలు చేయాలని కోరారు. అనంతరం రెడ్డిగూడెం కేజీబీవీ సందర్శించి ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను, టీచింగ్ డైరీలను పరిశీలించారు. 17మంది విద్యార్థుల గైర్హాజరుకు కారణాలు ఆరా తీసి ప్రిన్సిపాల్‌ను మందలించారు. డైరీ రాయని టీచర్లపై , స్టాక్ రిజిస్టర్ అప్‌డేట్ చేయని అకౌంటెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించిన వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. తనిఖీల్లో ఏడీ జి.నాంచారయ్య పాల్గొన్నారు.



కేజీబీవీలను తనిఖీ చేస్తున్న కార్యదర్శి మధుసూదనరావు

పింక్ టాయిలెట్ ప్రారంభం



బెంజిసర్కిల్ వద్ద పింక్ టాయిలెట్లను ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): మహిళల కోసం, మహిళతో నిర్వహించేదే ఈ పింక్ టాయిలెట్స్‌ని చాలా మంది మహిళలు, మహిళా ఉద్యోగస్తులు, ప్రయాణికులు, విద్యార్థినిలకు సౌకర్యవంతంగా ఉంటుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద నిర్మించిన పింక్ టాయిలెట్‌ను వీఎంసీ ఆధ్వర్యంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, సబ్ కలెక్టర్ అదితిసింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనసాంద్రత అధికంగా ఉండే బెంజిసర్కిల్ వద్ద ఇది ఏర్పాటుచేయడంతో చాలా మంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చాలా మంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఇందులో మరుగుదొడ్లు, చేంజింగ్ రూమ్, పాలిచ్చే తల్లులకు ఫీడింగ్ రూమ్, శానిటరీ వెండింగ్ మెషిన్ లో కేవలం ఐదు రూపాయలు పెడితే మూడు శానిటరీ నాప్కిన్స్ వచ్చే సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. నవంబర్ 19 ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈ మూడు రోజులు మరుగుదొడ్లకు వాటి వాడకంపై ప్రజలందరికీ తెలియజెప్పాలని ఉద్దేశంతో శుక్రవారం ఉదయం పింక్ టాయిలెట్‌ను ప్రారంభించామన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకించి ఒక టాయిలెట్స్‌ని రూ.20 లక్షలతో నిర్మించడం, వాళ్ళ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకించి రూములు గదులను కేటాయించారన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకించి ఒక టాయిలెట్ కల్పించడం అనేది ఒక మంచి ఆలోచనని, మహిళలు అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు షహీన బేగం, ప్రవల్లిక, నిర్మల కుమారి, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సైరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, చంద్రశేఖర్, మారిస్ స్టెల్లా కాలేజీ ఉపాధ్యాయురాలు స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు అనుమతి

గన్నవరం రూరల్ : మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో కొత్తగా ఆరు బీఎస్సీ పారామెడికల్ కౌన్సిల్ కోర్సులు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చినట్లు కళాశాల యాజమాన్యం శుక్రవారం తెలియజేసింది. బీఎస్సీ కార్డియాక్ కేర్ టెక్నాలజీ, కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ, ఎనస్తీషియాలజీ, ఇమేజింగ్, రేనాల్ డిసీజెస్, రెస్పిరేటరీ థెరపీ, ఆప్తమాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చదివిన వారు అర్హులన్నారు. ఒక్కొక్క కోర్సుకు 20 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మహిళాభ్యుదయంతో దేశ ప్రగతి

విజయవాడ కల్చరల్: మహిళాభ్యుదయంతోనే దేశ ప్రగతి సాధ్యమని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సేవాసంస్థ, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సొసైటీ సర్వీస్ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శుక్రవారం 'నా విజయంలో జీవిత భాగస్వామి' ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జమల పూర్ణమ్మ మాట్లాడుతూ మహిళా ప్రగతిని స్వాగతించాలని సూచించారు. సభాధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ దేశ ప్రగతిలో మహిళల పాత్ర విస్మరించలేనదని ప్రతి మగవాని జీవితంలో మహిళలు పాత్ర ఉంటుందన్నారు. ఠాగూర్ గ్రంథాలయ అధికారి రమాదేవి, లయన్స్ క్లబ్ దుర్గాతేజా అధ్యక్షురాలు దుంపల లక్ష్మీకుమారి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. వాకర్స్ జిల్లా గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలోఅభిప్రాయాలను తెలియజేసిన 25 మంది దంపతులను నిర్వాహకులు సత్కరించారు.



సభలో మాట్లాడుతున్న జమల పూర్ణమ్మ, ఆంజనేయరాజు, రామలింగరాజు, లక్ష్మీకుమారి

గ్రంథాలయాలు.. సాంకేతిక అంశంపై సదస్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గ్రంథాలయాలు సాంకేతికతను పూర్తి స్థాయిలో అమలు చేసినప్పుడు విద్యార్థులకు మరింత మేలు జరుగుతుందని ఇన్ఫర్మేటిక్స్ పబ్లిషింగ్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ రితీష్‌అయ్యార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం గ్రంథాలయాలు నూతన సాంకేతికత అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. రితీష్‌అయ్యార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు మానవ జీవితంలో చాలా ముఖ్యమైనవన్నారు. నూతన సాంకేతికత నేపథ్యంలో వస్తున్న మార్పులను గమనిస్తూ గ్రంథాలయాలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవడం ద్వారా మరింత విజ్ఞానవంతులవుతారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ విభాగాధిపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రితీష్ అయ్యార్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సూచనలకు అనుగుణంగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో రోడ్ల వెంట అక్రమ ఆక్రమణలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న అన్ని బస్సు షెల్టర్లను మున్సిపల్. ఏపీ ఎస్ఆర్టీసీ, పోలీస్ శాఖల సమన్వయంతో తనిఖీ చేయాలని చెప్పారు. అవసరమైతే కొత్త షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బస్ స్టాప్ ల వద్ద ఆక్రమణలు తొలగించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు దారి తీసే హోర్డింగ్‌లను గుర్తించి వాటిని తీసేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ యం. వై. దానం, ఆర్‌అండ్‌బీ డీఈ డి.యస్.యస్.ప్రసాద్, నేషనల్ హైవే ఇంజినీర్ యం.వి. నాగేశ్వరావు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ డి.ప్రసాద్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్–చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, డీసీపీ జుబిన్ సైరన్ రాయ్, డీసీపీ–1 భాస్కర్ బాబు, ఏసీపీ పి.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.నారాయణ మూర్తి, వి.శ్రీనివాస, వి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్– వి.నరసింహమూర్తి పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆదాయ లక్ష్యాలను అధిగమించాలి

జేటీసీ శివరామ ప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రవాణా శాఖ పరంగా నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను అధిగమించాలని జేటీసీ ఎస్. శివరామప్రసాద్ సిబ్బందికి సూచించారు. త్రైమాసిక పన్నుల బకాయిలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. శుక్రవారం బందర్ రోడ్డులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జేటీసీ శివరామ ప్రసాద్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాహనాల త్రైమాసిక పన్నుల ఎగవేతదారులపై ఆరా తీశారు. పన్నులు చెల్లించని వాహనాల జాబితాల ప్రకారం ప్రాంతాల వారీగా తనిఖీలు చేపట్టాలని, అటువంటి వాహనాలను సీజ్ చేయాలని ఆయన ఆదేశించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వాహనాలపై నమోదు చేసిన కేసుల నుంచి జరిమానాలు, త్రైమాసిక పన్నులు, పెనాల్టీలు రూ.47 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వాహనాల తనిఖీ సమయంలో అధికారులపై దుర్భాషలాడటం, దురుసుగా ప్రవర్తించడమనేది నేరమని, తనిఖీ అధికారులతో ఏదైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని వాహనదారులకు సూచించారు. సమావేశంలో డీటీసీ ఎం. పురేంద్ర, ఇన్‌చార్జ్ ఆర్టీఓ ఆర్. ప్రవీణ్, మోటార్ వాహన తనిఖీ అధికారులు రాంబాబు, రమణ, జీవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వర రావు, ఎంవీఎస్ రాజు, కార్యాలయ ఏవో అబ్దుల్ సత్తార్, చంద్రకళ, రాజుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేటీసీ శివరామప్రసాద్

ఘనంగా డ్రక్కర్ జయంతి

పెనమలూరు: ఆధునిక మేనేజ్‌మెంట్ పితామహుడు ప్రొఫెసర్ పీటర్ ఎఫ్ డ్రక్కర్ జయంతి కానూరులో శుక్రవారం నిర్వహించారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పీబీ సిద్ధార్థ అకడమిక్ డీన్ డాక్టర్ జంపాల రాజేష్ మాట్లాడుతూ పీటర్ ఎఫ్ డ్రక్కర్ రాసిన ఏజ్ ఆఫ్ డీస్ కంటిన్యూటీ, ఎకనామిక్ చైన్ కాస్టింగ్ ఆఫ్ ది ఆకార్పొరేషన్ పుస్తకాల గురించి వివరించారు. నాయకత్వ లక్షణాలు, నైపుణ్యత, సమాజంలో యువకుల పాత్ర తదితర అంశాలపై రాజేష్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, విభాగాధిపతి డాక్టర్ పి.ఆదిలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డీన్ రాజేష్

ఆదిదంపతుల సేవలో మంత్రి



దీపార్చన సేవలో మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రిని ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఊంజల్ సేవ, సహస్ర దీపార్చన సేవలో పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యశాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి) ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ నియామకాలు జరపనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు www.smcvja.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఆ ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: గడ్డి మందు తాగి, ఆస్పత్రిపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని పోతురెడ్డిపల్లి శివారు సింహాద్రిపురానికి చెందిన మోదుగుమూడి ప్రసాద్ కుమారుడు నాగబాబు (23) కూలి పనులు చేస్తూ తాతయ్య, అమ్మమ్మ ఇంటి వద్ద జీవనం గడుపుతున్నాడు. తరచూ కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. కడుపు నొప్పి తీవ్రత ఎక్కువ కావడంతో ఈ నెల 7వ తేదీన కొర్లగుంట శివారు సింహాద్రిపురంలో గడ్డి మందు తాగాడు. బంధువులు అతడ్ని నూజివీడు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆస్పత్రి సమాచారంతో కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పాతశివాలయంలో మండల పూజలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం కేరళ సంప్రదాయ పద్ధతిలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి హోమం, స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అర్చకులు మురళీధరన్‌నంబూద్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను కొనసాగించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ద్విచక్రవాహనాన్ని మినీవ్యాన్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గుంటుపల్లి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. తోట్లవల్లూరు గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే యువకుడు వ్యక్తిగత పనులపై నందిగామకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో తన బైక్‌పై వెళ్తుండగా గుంటుపల్లి వద్ద వెనుకనుంచి వచ్చిన మినీవ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌రెడ్డిని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దంత సంరక్షణపై శ్రద్ధ పెట్టాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీరోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన సదస్సు, చదరంగ పోటీలు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న దంత వైద్యుడు సీహెచ్ నారాయణరావు మాట్లాడుతూ మనిషి ఆరోగ్యం దంతాల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు బ్రష్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యుడు నారాయణరావును సత్కరించారు. అనంతరం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, డి.రమేష్, కె.రాంబాబు, జె.శంకర్, కుమార్, ఫణిబాబు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట గౌస్‌మొహిద్దీన్ వీధికి చెందిన షేక్ షర్మిళా ముంతాజ్, హనీఫ్ భార్యభర్తలు. వీరికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. ముంతాజ్ వన్‌టౌన్‌లోని ఓ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తుంటుంది. హనీఫ్‌కు మతి స్థిమితం లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. వాకింగ్ అని శుక్రవారం ఉదయం చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన హనీఫ్ తిరిగి రాలేదు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ప్రతాప్



నూజివీడు: నూజివీడులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు భూముల పంపిణీ కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలందరికీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, మహిళలు, యువతీ యువకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



పుల్లూరు(మైలవరం): పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పిన హామీలే కాకుండా ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్ ప్రవేశ పెట్టి గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించి వైద్య పరీక్షలు నిర్వహించడం గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లు ఉచితంగా అందజేశారు. గ్రామ సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు తరలివెళ్లిన ప్రజలు



చాట్రాయి: నూజివీడులో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలంలోని అనిన గ్రామాల నుంచి భారీగా జనం తరలి వెళ్లారు.ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాల్లో సుమారు 10 వేల మంది తరలివెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు మిద్దె బాలకృష్ణ, చెలికాని బాబ్జీ, కారంగుల వాసు, మోరంపూడి నాగేశ్వరావు, పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, పుచ్చకాయల అప్పిరెడ్డి, సర్పంచ్‌లు తరలివెళ్లారు.

జగనన్న ప్రగతిపథం పోస్టరు ఆవిష్కరణ



తిరువూరు: విజయవాడలో ఈ నెల 18న జగనన్న ప్రగతిపథం ర్యాలీ జరుగుతుందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. తిరువూరులో ర్యాలీ ప్రచార పోస్టరును శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు తెలియజేయడానికి వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం ఈ కార్యక్రమం తలపెట్టిందన్నారు. పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఐటీ విభాగ ప్రతినిధులు వేములకొండ తిరపతిరావు, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఐటీ విభాగ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మృతుడి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కొండపల్లి ఐడీఏలో హెచ్‌పీసీఎల్ సంస్థ వద్ద శుక్రవారం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. దేవరకొండ వెంకటేశ్వరరావు 25 ఏళ్లు ఆ సంస్థ అభివృద్ధికి పాటుపడి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందినట్లు సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ తెలిపారు. తండ్రి స్థానంలో కుమారుడికి పని కల్పించాలని కోరారు. ఇతర ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగం బదిలీకి అవకాశం ఉండగా, హెచ్‌పీసీఎల్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మానవతా దృక్పథంతో ఆలోచించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

తిరువూరు: నాగులచవితి పర్వదినాన్ని తిరువూరు పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం నిర్వహించారు. వేంకటాచలస్వామి ఆలయం, శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానం, శ్రీకనకదుర్గాలయాల్లోని పుట్టలలో పాలుపోసి పలువురు భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. నాగేంద్రస్వామికి శ్రీరామలింగేశ్వరాలయం, చంద్రమౌళీశ్వరా ఆలయాల్లో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మైలవరంలో..

మైలవరం: మండలంలో నాగుల చవితిని శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మైలవరం తారకరామానగర్, కోదండ రామాలయం, తిరువూరు రోడ్డు, మండలంలోని బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయంలోని నాగేంద్రస్వామి పుట్టపై భక్తులు పసుపు కుంకాలు చల్లారు. బొర్రగూడెం తిరుపతమ్మ ఆలయంలో పుట్టలో పాలు పోసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సి.గుడిపాడు, చాట్రాయి తుమ్మగూడెం శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. చిన్నారులను పుట్టలలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు

నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

జి.కొండూరు: నాగులచవితిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జి.కొండూరు గట్టు పక్కన ఉన్న నాగేంద్రస్వామి పుట్ట, అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజలు జరిపేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: నాగులుచవితిని మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా పుట్టలో పాలు పోసి నాగేంద్రస్వామికి విశేష పూజలు జరిపారు. పలువురు చిన్నారులకు చెవిపోగులు కుట్టించే కార్యక్రమాన్ని ఉల్లాసంగా నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలో భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, ద్వారకానగర్‌లో కృష్ణుడి గుడి వెనుక ఉన్న పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు.



తిరువూరు వేంకటాచలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మైలవరం మండలం బొర్రగూడెం ఆలయంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద భక్తులు



జి.కొండూరులో నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజలు



గంపలగూడెం మండలం కొణిజెర్లలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీనిధి, గీతమ్స్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయాల ఆవశ్యకతను లైబ్రేరియన్ పద్మావతి వివరించారు. ఈ నెల 20వరకు వారోత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజూ జరిగే పోటీలలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా విస్సన్నపేట గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. జూనియర్స్‌కు మై యాంబిషన్ అనే అంశంపై విద్యార్థులు ప్రసంగించారు. లైబ్రేరియన్ పి.భాను పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జి.కొండూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి.విజయకృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్లన కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణలో మానవుని పాత్ర అనే రెండు అంశాలపై సీనియర్, జూనియర్ విభాగాల్లో 42 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు వివరించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా రెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వేమన, శ్రీశ్రీ, బమ్మెర పోతనామాత్యుడు గురించి కవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, సీనియర్స్, జూనియర్స్ నిర్వహించారు. అనంతరం బొమ్మని వెంకరమణను శాలువతో సత్కరించారు. ప్రముఖ కవులు బొమ్మిన వెంకటరమణ, జే. బాలు, పి.ఆంటోని, రాజారావులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే పరిపూర్ణ జ్ఞానం

ముసునూరు: గ్రంథాలయాలయాల్లో లభ్యమయ్యే పలు ప్రామాణిక గ్రంథాల పఠనంతోనే అందరికీ పరిపూర్ణ జ్ఞానం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారి బి.ప్రసన్న పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపవరం బ్రాంచి గ్రంథాలయంలో శాఖాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆయుర్వేదం, సంస్కృత, తెలుగు గ్రంథ పఠనావశ్యకత అంశంపై చిన్నారులకు ఆమె అవగాహన కల్పించారు.

గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి సోపానాలు

నూజివీడు: గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి సోపానాలని రిటైర్డ్ తెలుగు పండితులు, కవి ఈమని శేషయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు కవులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లిలోని గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. గొల్లపల్లి హైస్కూల్ లైబ్రేరియన్ టీ నారాయణ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రముఖుల జీవితలపై అవగాహన ఉండాలి

మైలవరం: దేశ స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం పోరాడిన ప్రముఖుల జీవిత చరిత్రలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంబీఎం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు సీహెచ్ మాధవి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై కూడా విద్యార్థులు శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రంథాలయ సిబ్బంది జే నాగార్జున, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.



తిరువూరు గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు



గ్రంథాలయంలో గీసిన బొమ్మలు చూపుతున్న విద్యార్థులు



జి.కొండూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు



నూజివీడులో కవులను సన్మానిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

తిరువూరురూరల్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో దృష్టిలోపం గుర్తించి శస్త్ర చికిత్సలు నిర్వహించిన వృద్ధులకు శుక్రవారం కళ్ల జోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. రోలుపడి, ఆంజనేయపురం, అక్కపాలెం గ్రామాల్లో 200 మందికి కళ్లజోళ్లను సర్పంచులు కాంతమ్మ, కుటుంబరావు, రవికుమార్ అందజేశారు.

విష్ణు సహస్రనామ పారాయణం

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో శుక్రవారం కార్తీకమాసోత్సవాల్లో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణ గావించారు. వేంకటాచలస్వామికి అష్టోత్తర శతనామావళితో పూజాదికాలు నిర్వహించిన అనంతరం వికాస తరంగిణి మహిళా సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు పర్యవేక్షించారు.

జగనన్న ప్రగతిపథం విజయవంతం చేయండి

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించేందుకు శనివారం విజయవాడ వేదికగా జరగనున్న జగనన్న ప్రగతిపథం కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.


17 ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరు

తిరువూరు: మండలంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు 17 కేంద్రాలను మంజూరు చేసినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టు లస్కర్ మృతి

చాట్రాయి: మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో పని చేస్తున్న లస్కర్ మేడూరి రాజారావు (50) శుక్రవారం ఉదయం యడవల్లిలో విధులకు వస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ తదితరులు రాజారావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫారెస్ట్ బీట్ అధికారి అనారోగ్యంతో మృతి




ఇందుపల్లి సుకుమార్ (ఫైల్)

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు రిజర్వ్ ఫారెస్ట్ బీట్ అధికారి ఇందుపల్లి సుకుమార్(53) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఇటీవల గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడి అనారోగ్యానికి గురయ్యాడు. ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. ఫారెస్ట్‌లో సీతాకోకచిలుకల పార్క్ నిర్మాణంలో నందిగామ ఫారెస్ట్ సెక్షన్ అధికారి లెనిన్‌కుమార్‌తో పాటు సుకుమార్ కూడా కృషి చేశారు. మృతదేహాన్ని తన స్వగ్రామం మానకొండకు తరలించారు. ఫారెస్ట్ అధికారులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ఏ.కొండూరు: ప్రకృతి వ్యవసాయ పంటలు సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో లాభాలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని పాతరేవూడిలో శుక్రవారం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాధార పంటలు ఎండుముఖం పట్టాయని ప్రకృతి వ్యవసాయ పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రెయినర్ బెంజిమెన్ పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ విజయకుమారి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ద్విచక్రవాహనాన్ని మినీవ్యాన్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గుంటుపల్లి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. తోట్లవల్లూరు గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే యువకుడు వ్యక్తిగత పనులపై నందిగామకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో తన బైక్‌పై వెళ్తుండగా గుంటుపల్లి వద్ద వెనుకనుంచి వచ్చిన మినీవ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌రెడ్డిని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అడుగడుగునా సీఎంకు ప్రజల నీరాజనాలు

నూజివీడు: పేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూజివీడులో పర్యటించారు. ముఖ్యమంత్రికి అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. సీఎం పర్యటన వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో, ప్రజల్లో జోష్‌ను నింపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం సభకు వేలాది మంది ప్రజలు తరలిరావడంతో ఏర్పాటు చేసిన సభాస్థలిలోనే కాకుండా మెయిన్‌రోడ్డు మొత్తం జనంతో కిక్కిరిసింది. మైలవరం రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్‌లో నూజివీడు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అక్కడి నుంచి విస్సన్నపేట రోడ్డులోని సభా వేదిక వద్దకు ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. సీఎంతో పాటు బస్సులో ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు కలిసి వచ్చారు. హెలీప్యాడ్ నుంచి బయలుదేరిన దగ్గర నుంచి దారికిరువైపులా పెద్ద ఎత్తున ప్రజలు పూలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం, శ్రీనివాసా సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, తిరువూరు బస్టాప్ సెంటర్, తదితర ప్రాంతాల్లో వందలాది మంది ప్రజలు ముఖ్యమంత్రిని చూసేందుకు ఇరువైపులా నిలిచి పూలవర్షం కురిపించారు. ముఖ్యమంత్రి ప్రజలందరికీ ముకుళిత హస్తాలతో, చిరునవ్వుతో నమస్కారం చేశారు. సభాస్థలికి సమీపంలోకి చేరుకున్న వెంటనే అప్పటికే అక్కడికి చేరుకున్న వేలాది మంది ప్రజలు హర్షధ్వానాలతో, కరతాళ ధ్వనులతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించగానే ప్రజలు ముఖ్యంగా యువత 'జై జగన్.. జగనన్నా.. నువ్వే మా భవిష్యత్తు' అంటూ పకార్డులతో నినాదాలు చేశారు. సీఎం ప్రసంగించి, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి కార్యక్రమం పూర్తయ్యేవరకు ప్రజలు అక్కడ నుంచి కదలకుండా ఉండిపోయారు. తోడేళ్లు ఎన్ని కలిసి వచ్చినా సింహం సింగిల్‌గానే వస్తుందని జగన్ తన ప్రసంగంలో అనగానే సభా ప్రాంగణమంతా కరతాళ ధ్వనులు, ఈలలతో మార్మోగింది. ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి నేతృత్వంలో డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, పటిష్ట ప్రణాళికతో చేసిన ఏర్పాట్లతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైంది.

ముసునూరులో..

ముసునూరు: నూజివీడులో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వేలాది మంది మండల ప్రజలు తరలివెళ్లారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు తెలిపారు.

జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ దుర్గాభవాని, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, మాజీ ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, గ్రామ పార్టీల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు తరలి వెళ్లారు.



నూజివీడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం రోడ్డు వెంబడి ఉన్న ప్రజలు



స్వాగతం సీఎం జగన్ సార్ అంటూ ప్లకార్డులు పట్టుకున్న మహిళలు



ముసునూరు మండలం చెక్కపల్లి నుంచి బస్సులో నూజివీడు వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నవరత్న పథకాలతో పేదలకు ఉపయోగం

విస్సన్నపేట: ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేదలకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. విస్సన్నపేట సచివాలయం–4 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బీసీ కాలనీలో గడప గడపకు వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు. ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాలు, నాడు–నేడు ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. పేదలకు మంచి చేయాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి సంబంధించి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివబాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి పాల్గొన్నారు.

మద్దులపర్వ గ్రామంలో..

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలు అమలు తీరు–చంద్రబాబు హామీల అమలు తీరుపై ప్రతి ఇంటా సర్వే నిర్వహించారు. ప్రజా తీర్పు పుస్తకంలో ఆయా కుటుంబాల అభిప్రాయాలను నమోదుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, మండల సచివాలయాల కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, రైతు సలహా మండలి ఆధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రవి, రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి మీరా సాహెబ్ పాల్గొన్నారు.



మద్దులపర్వలో 'వై ఏపీ నీడ్స్ జగన్'లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

ఓబులాపురంలో మట్టి ట్రాక్టర్ల స్వాధీనం

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం ఓబులాపురంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న మట్టి మాఫియా దారులు, వారి వాహనాలపై మైలవరం సీఐ డీకే మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెడ్డిగూడెం ఎస్సై శ్రీను ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా రెడ్డిగూడెం మండలం ఓబులాపురంలో నాగసానిపాటి చెరువులో శుక్రవారం అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారనే సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీను సిబ్బందితో వెళ్లి మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న ఒక జేసీబీతో పాటు మట్టిని తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తవ్వకాలు నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు

ఎన్టీటీపీఎస్ అభివృద్ధికి కృషి చేయండి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ సంస్థ అభివృద్ధికి యూనియన్ నాయకులు, కార్మికులు కృషి చేయాలని ఏపీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్‌జీఎస్ఎస్ బాబ్జి అన్నారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ యూనియన్–1535 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షతన యూనియన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పంగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. సమస్యలు ఉంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుందామని ఆయన పేర్కొన్నారు. సంస్థ పురోభివృద్ధికి నిరంతరం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, కోశాధికారి మధుబాబు, ప్రాంతీయ కార్యదర్శి వెంకటరావు, కోశాధికారి శ్రీనివాసరావు, మధుప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.



ఏపీజెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బాబ్జిని కలిసి అభినందిస్తున్న అన్నే శ్రీనివాస్‌కుమార్, యూనియన్ నాయకులు

కానిస్టేబుల్‌ను పరామర్శించిన ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ గోపీ విధులు నిర్వహిస్తూ ఇటీవల ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్‌లో ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న, పాలడుగు దుర్గాప్రసాద్ సీఐ పి.శ్రీనుతో కలసి గొల్లపూడి ఆంధ్రా వైద్యశాలలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.



గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎంపీపీ జోత్స్న దంపతులు, సీఐ శ్రీను


THANK YOU CM SIR
అశేష జనవాహినికి
కృతజ్ఞతాభినందనలు
నూజివీడులో జరిగిన అసైన్డ్ భూములకు
శాశ్వత భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన
గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి
బహిరంగ సభకు వేలాదిగా విచ్చేసి విజయవంతం చేసిన
నూజివీడు నియోజకవర్గ అశేష ప్రజానీకానికి మరియు
నలుమూలల నుండి విచ్చేసిన అభిమానులకు
మా హృదయపూర్వక కృతజ్ఞతాభినందనలు
రాజన్న వారసులం..
జగనన్న సైనికులం...
జగనే కావాలి
జగనే రావాలి
మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
శాసనసభ్యులు, నూజివీడు నియోజకవర్గం
మేకా వెంకట నాగ వేణుగోపాల్ అప్పారావు
వైఎస్ఆర్‌సిపి యువనాయకులు, నూజివీడు నియోజకవర్గం
నూజివీడు కోటపై జగనన్న జెండా ఎప్పుడూ ఎగురుతూనే వుంటుంది.